క్లుప్తంగా

శివ కాపును సన్మానించిన అధికారులు



డాక్టర్ శివ కాపును సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: దళిత కాపు బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుంగుళూరు శివ కాపును వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఘనంగా సన్మానించారు. బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో జరిగిన పూలే వర్ధంతి సభలో పాల్గొన్న ఆయనను అధికారులు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు నిర్విరామ కృషి చేస్తున్న ఆయనకు ఈ ఘనత దక్కింది.

1, 2 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో నిర్వహించే సీపీఎం 14వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సీపీఎం జిల్లా మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధుతో పాటు రాష్ట్ర నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. మహాసభలను సీపీఎం నేతలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: కొంకావీధిలోని సాయిబాబా మందిరంలో శ్రీసాయి బాబా విగ్రహం ప్రతిష్ఠంచి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మందిరం వద్ద సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. దీనికి ముందు మందిరంలో శ్రీసాయిబాబాకు శ్రీద్వారకామయి శ్రీషిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా సమాజ్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

16న నాటక ప్రదర్శన



మాట్లాడుతున్న దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు

తిరుపతి కల్చరల్: పండు క్రియేషన్స్ సౌజన్యంతో తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు మహతి కళాక్షేత్రంలో ×పడమటి గాలి× నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, నాటక దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి వెన్నెముక లాంటి అన్నదాత రైతన్న జీవితం ఇతివృత్తంగా ఈ నాటకం చక్కటి సందేశాత్మకంగా సాగుతూ జనావళినిలో చైతన్యాన్ని రేకెత్తిస్తుందని తెలిపారు. 60 మంది కళాకారులచే సుమారు రెండున్నర గంటల పాటు అద్భుత సెట్టింగ్‌ల నడుమ నాటకం ఉంటుందని తెలిపారు. తిరుపతి ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు, ప్రతినిధులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఎస్.ధర్మయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. కార్యక్రమంలో ఈఓ సతీమణి సుధ, ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

మిగతా సీజన్లతో పోలిస్తే చలికాలంలో ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. చల్లటి గాలుల వల్ల పిల్లలు, పెద్దల్లో అనారోగ్య సమస్యలు సంభవిస్తుంటాయి. అవి రాకుండా ఉండాలంటే, ఒకవేళ వచ్చినా త్వరగా తగ్గిపోవాలంటే శరీరంలో తగిన రోగనిరోధక శక్తి ఉండాలి. అయితే కొన్ని రకాల విటమిన్లు అందుకు సహాయ పడతాయని ఆరోగ్య నిపుణులు సలహాలు ఇస్తున్నారు. – తిరుపతి తుడా

విటమిన్... ఆరోగ్యమిచ్చేన్



- విటమిన్ లోపంతోనే అనారోగ్య సమస్యలు
- చలికాలంలో విటమిన్లు వ్యాధుల తీవ్రతను తగ్గిస్తాయి
- పోషకాహార పదార్థాలు తప్పనిసరిగా తీసుకోండి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

■ విటమిన్ ఏ

చలికాలంలో జలుబు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ. రోగ నిరోధక శక్తిని పెంచడం ద్వారా వీటిని నివారించడంలో విటమిన్ ఏ అద్భుతంగా సహాయపడుతుంది. క్యారెట్లు, చిలగడ దుంపలు, పాలకూర, పాలు, చీజ్ బీఫ్ లివర్, క్యాప్సికం, గుమ్మడి కాయ వంటి వెజిటబుల్స్‌లో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది.

■ విటమిన్ బీ–12

శరీరానికి అవసరమయ్యే అత్యంత ముఖ్యమైన వాటిలో బి–12 విటమిన్ కీలకమైంది. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. సాల్మన్ చేపలు, టునా ఫిష్, చికెన్, కోడిగుడ్లు, పాలు వంటి పదార్థాల్లో విటమిన్ బి–12 లభిస్తుంది.

■ విటమిన్ బీ–6

విటమిన్ బీ–6 శరీరానికి ఉపయోగపడే అతి ముఖ్యమైన పోషకం. ఇది రోగ నిరోధక కణాలను పెంచడంతో పాటు ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారి నుంచి త్వరగా కోలుకోవడంలో సహాయపడుతుంది. కాయధాన్యాలు, బీన్స్, కోడిగుడ్లు, నట్స్, సోయా ప్రొడక్ట్స్, మీట్స్, సాల్మన్ చేపల్లో విటమిన్ బీ–6 పుష్కలంగా లభిస్తుంది.

■ విటమిన్ డీ

తెల్ల రక్తకణాలైన మోనో సైటిస్ సామర్థ్యాన్ని పెంచడంలో, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఇలా అనేక రకాల సీజనల్ వ్యాధులను, ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం నుంచి శరీరాన్ని కాపాడడంలో విటమిన్ డీ బాగా పని చేస్తుంది. కొవ్వు చేపలు, కోడిగుడ్డు సొన, మష్రూమ్స్, సోయా మిల్క్ వంటి వాటిలో డి విటమిన్ పుష్కలంగా ఉంటుంది.

■ విటమిన్ ఈ

యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండి, రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ విటమిన్ అద్భుతంగా పనిచేస్తుంది. ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రిస్తుంది. రోగ నిరోధక కణాల పనితీరును మెరుగు పరుస్తుంది. ఆకు కూరలు, నట్స్, సీడ్స్, కోడిగుడ్లు, గుమ్మడి గింజలు, చేపలు వంటివి రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

■ విటమిన్ సీ

శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి అవసరమైన ముఖ్యమైన వాటిలో విటమిన్ సి ఒకటి. దీన్ని మైక్రో న్యూట్రియంగా పేర్కొంటారు. తెల్ల రక్తకణాల ఉత్పత్తి, పనితీరులో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. నిమ్మ, నారింజ, బ్రోకలీ, బెర్రీ వంటి వివిధ రకాల సిట్రస్ పండ్లలో ఇది ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్‌లదే కీలక పాత్ర



మానవుడి ఆరోగ్య సంరక్షణలో విటమిన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజలు వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. విటమిన్ లోపం వల్ల శరీరంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. విటమిన్లు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని ప్రతి వ్యక్తి తీసుకోవడంలో సురక్షితమైన ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. ఏ, బీ, సీ, డీ, ఈ, కే విటమిన్‌లో ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు.

– డాక్టర్ మంజువాణి, పోషకాహార నిపుణులు, తిరుపతి

విటమిన్లు ఉండే వాటినే తీసుకోవాలి



మనిషి శరీరంలో విటమిన్లు లోపిస్తే వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా చలికాలంలో కొన్ని విటమిన్లు లోపిస్తే రకరకాల చర్మవ్యాధులు, నోటి పుండ్లు, వెంట్రుకలు రాలిపోవడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీటిని అధిగమించాలంటే సూక్ష్మ పోషక ఆహారాన్ని తీసుకోవాలి. ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, ఆకుకూరలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. తద్వారా చలికాలంలో అనారోగ్య సమస్యలను అధిగమిస్తాయి.

– డాక్టర్ నీలిమ, చర్మ వైద్య నిపుణురాలు, తిరుపతి

నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: రుయా ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షురాలిగా నిర్మల, ప్రధాన కార్యదర్శిగా ఉషారాణి, కోశాధికారిగా నీలవేణి నియమితులయ్యారు.

పూలే ఆశయ సాధనకు నడుం బిగించాలి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శివ కాపు, అసోసియేషన్ సభ్యులు

తిరుపతి సిటీ: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు యువత నడుం బిగించాలని ఏపీ దళిత కాపు బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుంగుళూరు శివ కాపు పిలుపునిచ్చారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం బాలాజీ కాలనీలోని ఆయన విగ్రహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ నరేంద్రయాదవ్, వైస్ ప్రెసిడెంట్ జయరామయ్య, కోశాధికారి ఆనంద్ పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరణ



అధికారులతో సమావేశమైన కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను పక్కాగా సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తరలించేందుకు న్యూ బాలాజీ కాలనీ, వినాయక సాగర్ వద్ద చెత్త తరలింపు కేంద్రాలను (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటు చేశారు. వినాయక సాగర్ వద్ద ఉన్న కేంద్రాన్ని గురువారం కమిషనర్ ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. వాహనాల కండిషన్, డ్రైవర్లు, సిబ్బంది హాజరు నమోదు, వాహనాల రాకపోకలు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి వీధికి వాహనాలు నిర్దిష్ట సమయంలో వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాహనాలు ఎక్కడెక్కడకు వెళ్తున్నాయో తెలుసుకునేలా జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా వాహనం మరమ్మతులకు గురైతే వెంటనే మరో వాహనం వెళ్లేలా చూడాలని, అలాగే చెత్త తరలింపు కేంద్రానికి వచ్చే వాహనాల్లో ఎంత చెత్త వస్తోంది ? తూకివాకం కేంద్రానికి కాప్సుల్స్‌లో ఎంత తరలిస్తున్నారనేది పక్కగా కంప్యూటర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డీఈలు పాల్గొన్నారు.

కురబల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న కురబ సంఘనేతలు

తిరుపతి కల్చరల్: జిల్లాలోని కురుబల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కురబ సంఘ నేతలు గురువారం మంత్రి మంత్రి ఎస్.సవితకు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రిని కురబ కులసంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురబ, కురుమ, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమలలో కనకపీఠం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో కురబ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయడంతో పాటు నగరంలో భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కురబ కుల సంఘ నేతలు జిల్లా యువజన సంఘం నేత శ్రీనివాసులు, మల్లి, హరినాథ్, రమేష్, ఆదినారాయణ, పోతయ్య, రఘురాం, శంకరయ్య, రెడ్డిశేఖర్, రెడ్డి సుధాకర్, చంద్ర ఉన్నారు.

ప్రతి భక్తుడికీ అమ్మవారి దర్శనం



ప్రదర్శన శాలలో అమ్మవారి ప్రతిరూపాన్ని, తిలకిస్తున్న టీటీడీ ఈఓ, జేఈఓ



ఫలపుష్ప ప్రదర్శన శాలను ప్రారంభిస్తున్న ఈఓ, అడిషనల్ ఈఓ, జేఈఓ

– ఈఓ శ్యామల రావు

చంద్రగిరి: ప్రతి భక్తుడికీ పద్మావతి అమ్మవారి దర్శనభాగ్యం కల్పిస్తామని టీటీడీ ఈఓ శ్యామలరావు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. మాడవీధుల్లో ఉండే ప్రతి భక్తుడికి వాహన సేవ దర్శనం కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గజ వాహన సేవ, పంచమీ తీర్థానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారని, ఇందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన హిందూ మహాసభ ట్రస్ట్ చైర్మన్ డీఎల్ వసంత కుమార్ తదితరులు అమ్మవారికి ఆరు గొడుగులను కానుకగా అందించారు.

ఆకట్టుకున్న ఫలపుష్ప ప్రదర్శనలు..


శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల్లో భక్తి భావం పెంపొందించేలా శుక్రవారపు తోటలో ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన బాగుందని ఈఓ శ్యామలరావు తెలిపారు. అమ్మవారి ఉద్యానవనంలో టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో విభిన్న పుష్ప, ఔషధ మొక్కలు, పండ్లు, కూరగాయలతో చేసిన వివిధ దేవతా మూర్తుల ప్రతిమలు, పురాణ ఘట్టాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలాగే టీటీడీ ఆయుర్వేద కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారు. టీటీడీ శ్యామలారావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మంతో కలసి శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్పకళాశాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శనశాలను ప్రారంభించారు.



పుష్పాలతో తయారు చేసిన గుర్రం



పసిబాలుడిగా ఉన్న శ్రీకృష్ణున్ని గంపలో పెట్టుకుని తీసుకొస్తున్న వసుదేవుడు



సీతాదేవి అన్వేషణ కోసం లంకా నగరం వైపుగా వారధి కడుతున్న వానరులతో శ్రీరామలక్ష్మణులు



సైకతంతో ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవార్ల చిత్రాలను వీక్షిస్తున్న ఈఓ, అడిషనల్ ఈఓ

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

- వాడవాడలా జ్యోతిరావు పూలేకి నివాళి

తిరుపతి సిటీ: మహాత్మా జ్యోతిరావు పూలే మహా సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం వర్సిటీ పరిపాలన భవనంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని, నిమ్న వర్గాలకు, మహిళలకు విద్యను అందించాల ని ప్రత్యేక పాఠశాలను ప్రారంభించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ ఓబీసీ ఫోరం సభ్యుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఇంజినీర్ తాండవ కృష్ణ, ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య, డాక్టర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపకుడు పూలే..

తిరుపతి కల్చరల్: సమ సమాజ స్థాపనకు నిరంతరం కృషి చేయడంతో పాటు అణగారిన వర్గాల అభ్యున్నతికి శ్రమించి వారి పాలిట జ్యోతిరావ్ పూలే ఆశాజ్యోతిగా నిలిచారని మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకొని బీసీ సంఘర్షణ సమితి సభ్యులతో కలిసి బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి గురువారం వారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి నేతలు, బీసీ నేతలు పాల్గొన్నారు.



వర్సిటీలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు



పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి, బీసీ నేతలు

పూలే ఆశయ సాధనకు కృషి

బలహీనవర్గాల అభ్యున్నతికి చివరి వరకు పోరాటం కొనసాగించిన పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గురువారం పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . అక్కిపల్లి లక్ష్మయ్య, మధు ఆచారి, చంద్రబాబు, ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నేతలు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బీజేపీ నేతల ఆధ్వర్యంలో..

తిరుపతి గాంధీ రోడ్డు: నగరంలోని బాలాజీ కాలనీలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: సామాజిక ఆలోచనాపరుడు, విప్లవ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతీరావు పూలే వర్ధంతిని గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి బీసీ బాలికల హాస్టల్, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో వార్డెన్లు ఫహమద్ బున్నీస, మాలతి ఆధ్వర్యంలో విద్యార్థులు జ్యోతిరావ్ పూలే చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

రుయాలో..

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవి ప్రభు, ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, ఏడీ దాత్రేశ్వరి, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజు, ఏపీ ఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు మైనార్ వరప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి



పూలేకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



చంద్రగిరి బీసీ బాలికల హాస్టల్లో..

సీఎం ఇంటి సమీపంలో కూలిన చెట్టు

- సంతాప సభ జరుగుతుండగా ఘటన
- పగిలిన కాన్వాయ్ కారు అద్దాలు
- ఎవరికీ ఇబ్బంది లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

చంద్రగిరి: మండలంలోని నారావారిపల్లెలోని సీఎం చంద్రబాబు స్వగృహం సమీపంలో సంతాప సభ నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో సంతాప సభ జరుగుతుండగా ఓ వృక్షం ప్రమాదవశాత్తూ నేలకూలింది. దీంతో అక్కడే ఉన్న సీఎం కాన్వాయ్‌లోని ఓ వాహన అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎవరికీ ఎటువంటి హాని జరగకపోవడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం హుటాహుటిన అధికారులు నేలకూలిన వృక్షాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కల్యాణ మండపం సమీపంలోనే ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చెట్టుకు వెనుక వైపున సంతాప సభ నిర్వహించారు. గత రెండు రోజుల పాటు కురిసిన వర్షాల వల్ల తేమ ఎక్కువై చెట్టు కూలి ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు.



కల్యాణ మండపం సమీపంలో వృక్షం నేలకూలడంతో దెబ్బతిన్న కాన్వాయ్‌లోని కారు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: కలియుగదైవం శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ మంత్రులు వాసంశెట్టి సుభాష్, ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ మంత్రి సుజాత, తెలంగాణ ఎమ్మెల్యే వినోద్, ప్రభుత్వ విప్ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సినీ నటుడు రాజారత్నం, కన్నడ సినీ నటి రచితా రామ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి తిరుమల ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.